



ఏటూరునాగారంలో దహనం అవుతున్న రావణాసుర ప్రతిమ



భూపాలపల్లి అంబేడ్కర్ క్రీడా మైదానంలో రావణాసుర వధ కార్యక్రమానికి హాజరైన ప్రజలు



భూపాలపల్లిలో దహనమవుతున్న రావణ ప్రతిమ

అంబరాన్నంటిన సంబురం

- వైభవంగా దసరా వేడుకలు
- ఆకట్టుకున్న రావణవధ
- బాణసంచాతో మార్మోగిన పరిసరాలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- భూపాలపల్లి జిల్లాలో సందడే సందడి

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 13: దసరా పర్వదినాన్ని జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఊరూరా సంబరాలు అంబరాన్నంటాయి. శమీ, ఆయుధ పూజలు, రావణవధ కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. కాటారం మండలంలోని తన స్వగ్రామమైన ధన్వాడలో దత్తాత్రేయస్వామి ఆలయంలో దుర్గామాత వద్ద రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భూపాలపల్లి పట్టణంలోని కృష్ణకాలనీ అంబేడ్కర్ క్రీడా మైదానంలో మునిసిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో జరిగిన రావణ వధ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సతీసమేతంగా హాజరయ్యారు. భార్య పద్మతోపాటు కూతుళ్లు పాల్గొన్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరగ్గా రావణాసుర ప్రతిమను బాణసంచాతో పేల్చి సంబురాలు చేశారు. జనం భారీగా హాజరుకావడంతో క్రీడా మైదానం కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. యూ ట్యూబర్స్ పాల్గొని ఆటపాటలు, కామెడీతో ఆహూతు లను అలరించారు. సింగర్ శైలజ పాడిన పాటలకు జనం స్టెప్పులు వేశారు. పలువురు డ్యాన్సర్లు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. రావణవధ సందర్భంగా క్రీడామైదానంలో వీవీఐపీ, వీఐపీ గ్యాలరీలతో పాటు సాధారణ ప్రజలు కూర్చుండేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. సుమారు 5వేల మందికి కుర్చీలు వేశారు. కానీ సుమారు 20వేల మంది హాజరయ్యారు. వీవీఐపీ గ్యాలరీలో సుమారు 300 మందికి మునిసిపల్ పాలక వర్గం టోకెన్లు ఇచ్చింది. కానీ టోకెన్లు తీసుకు న్న వారికి కూడా సీట్లు దొరకని పరిస్థితి ఎదురైంది.

విజయానికి సంకేతం..

చెడుపై మంచి విజయం సాధించడానికి సంకేతానికి నిదర్శనంగా దసరా వేడుకలను నిర్వహించడం సంప్రదాయంగా వస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనా రాయణ అన్నారు. ప్రజలు తనకు గురుతరబాధ్యత ఎమ్మెల్యే పదవి ఇచ్చారని, దానిని నెరవేర్చేందుకు శ్రయాశక్తులా కృషి చేస్తున్నాని అన్నారు. భూ పాలపల్లి నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దే బా ధ్యత తీసుకున్నానని తెలిపారు. ప్రజలు సుభిక్షంగా ఉండేలా ఆ దుర్గాదేవిని వేడుకున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్, వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, కౌన్సిలర్లు ముంజాల రవీందర్, జక్కం రవికుమార్, నూనె రాజు, దాట్ల శ్రీనివాస్, మౌనిక, హారిక, రజిత, రేణుక, అనిల్‌కుమార్, నారాయణ, మురళీధర్, కాంగ్రెస్ నాయకులు చల్లూరి మధు, బుర్ర కొమరయ్య, రాజేందర్, గ్రంథాలయ మాజీ చైర్మన్ బుర్ర రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కనుల పండువగా దసరా వేడుకలు

- ఉత్సాహంగా రావణ వధ
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



ములుగులో రావణ ప్రతిమకు నిప్పు పెడుతున్న జడ్జి కన్నయ్యలాల్

ములుగు, అక్టోబరు 13: దసరా వేడుకలు జిల్లాలో ఘనంగా జరిగాయి. విజయదశమి పర్వదినాన్ని సంప్రదాయ పద్ధతిలో వైభవంగా జరుపుకున్నారు. ఊరూరా శమీ పూజలు వేడుకగా నిర్వహించారు. బొడ్రాయి, గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేసి జమ్మిచెట్టును దర్శించుకున్నారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల అనంతరం జమ్మి ఆకును సేకరించి ఒకరికొకరు పంచుకొని అలయ్‌బలయ్ తీసుకున్నారు. పాలపిట్టను తిలకించి పరవశించిపోయారు. దసరా సందర్భంగా మద్యం, మాసం దుకాణాల్లో వ్యాపారం జోరుగా సాగింది. ఈ పండుగలో ముక్క, చుక్కకే ఎక్కువ ప్రాధాన్యత కాగా కుటుంబ సభ్యులు, బంధువులలో ఊళ్లన్నీ సందడిగా మారాయి. ఉద్యోగ, ఉపాధి కోసం వేరే ప్రాంతాలకు తరలివెళ్లిన వారు కూడా దసరాకు స్వగ్రామాలకు రావడంతో సుదీర్ఘ కాలం తర్వాత కలుసుకున్న బంధుమిత్రులు ఆనందంగా గడిపారు.

వైభవంగా రావణ వధ

జిల్లా కేంద్రంలో రావణ వధ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని మైదానంలో వేడుకగా నిర్వహించారు. భారీ రావణ ప్రతిమకు జిల్లా సీనియర్ జడ్జి కన్నయ్య లాల్ నిప్పుపెట్టారు. కళాకారుల ప్రదర్శనలు, బాణసంచా పేలుళ్ల విశేషంగా ఆకట్టుకున్నాయి. జిల్లాకేంద్రంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి సుమారు రెండువేల మంది తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ సేవికా సమితి జిల్లా ప్రముఖ్ వాంకుడోతు జ్యోతి, ఉత్సవ సమితి అధ్యక్షుడు గండ్రకోట కుమార్, సీఐ శంకర్, ఎస్సై వెంకటేశ్వర్‌రావు, ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన మత సామరస్యం

ములుగు, అక్టోబరు 13: దసరా సందర్భంగా ములుగు జిల్లాలో మతసామరస్యం వెల్లివిరిసింది. గ్రామదేవతలకు పూజలు, బోనం సమర్పణ, పాల పిట్ట దర్శనం వంటి హిందూ సంప్రదాయ పద్ధతిలో జరిగే ఈ వేడుకలను ములుగు మండలం మహ్మద్‌గౌస్‌పల్లిలో హిందూ ముస్లిం సమష్టిగా జరుపుకున్నారు. రెండు మతాలకు సంబంధించిన ఆచార సంప్రదాయాలను పాటిస్తూ గ్రామస్థులం తా దసరా పండగలో సంబురంగా పాల్గొన్నారు. అనాదిగా వస్తున్న కట్టుబాట్లను కొనసాగిస్తూ తొలుత ముస్లిం సంప్రదాయ పద్ధతిలో తెల్లజెండాను ఎగురవేశారు. కరువు కాటకాలు సంభవించకుండా పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని దైవాన్ని ప్రార్థించారు. అనంతరం ఊరేగింపుగా బొడ్రాయి వద్దకు చేరుకొని గ్రామదేవతలకు పూజలు చేశారు. మొహర్రం సందర్భంగా జరిగే పీరీల ఉత్సవంలో కులమతాలకు అతీతంగా హిందూ ముస్లింలు పాల్గొంటుండగా. దసరా వేడుకల్లో కూడా మతసామరస్యాన్ని పాటించడం పట్ల సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.



మహ్మద్‌గౌస్‌పల్లిలో దసరా వేడుకల్లో భాగంగా దైవ ప్రార్థన చేస్తున్న హిందూ ముస్లింలు

చెడుపై ధర్మానిదే విజయం

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

ములుగు, అక్టోబరు 13: చెడుపై ఎప్పుడూ ధర్మమే విజయం సాధిస్తుందని, పాప వినాశనానికి, మంచికి చిహ్నంగా నిలిచే దసరా పర్వదినం సమష్టతత్వానికి ప్రతీకగా నిలుస్తుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శనివారం ములుగులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. భద్రతా సిబ్బంది, వ్యక్తిగత సహాయకులతో కలిసి వాహన, ఆయుధ, శమీ పూజలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరికీ శుభాలు కలగాలని భగవంతుడిని వేడుకున్నారు.



ములుగుక్యాంపు కార్యాలయంలో ఆయుధ పూజ చేస్తున్న మంత్రి సీతక్క

ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలి

- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కాటారం, అక్టోబరు 13: రాష్ట్రంలోని ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కాంక్షించారు. విజయదశమి సందర్భంగా శనివారం మండలంలోని తన స్వగ్రామం ధన్వాడ దత్తాత్రేయస్వామి ఆలయంలో దుర్గామాత వద్ద మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించే శక్తి ప్రజాప్రభుత్వానికి ఇవ్వాలని దుర్గామాతను వేడుకున్నట్లు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు పాడిపంటలు, ఆయురా రోగ్యాలతో ఉండాలన్నారు. ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.



ధన్వాడలో దుర్గామాత వద్ద పూజలు చేస్తున్న రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు



జల విహారంలో హంసవాహన తెప్పోత్సవం

అలరించిన తెప్పోత్సవం

- జలవిహారంలో హంస వాహనంపై అమ్మవారు
- నిజరూప దర్శనంలో భద్రకాళి
- దసరా వేళ పోటెత్తిన భక్తులు
- హాజరైన మంత్రి సురేఖ, కలెక్టర్



వరంగల్ కల్చరల్, అక్టోబరు 13: వరంగల్‌లోని భద్రకాళి ఆలయంలో అంగరంగ వైభవంగా కొనసాగిన దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. దసరా రోజున అమ్మ వారికి అపరాజిత, ఆయుధ శమి పూజలు నిర్వహించారు. వాహన పూజలతో భద్రకాళి అమ్మవారికి సామ్రాజ్య పట్టాభిషేకాన్ని నిర్వహించి, శరభ వాహనంపై ఊరేగించారు. సాయంత్రం చక్రస్నానం, ధ్వజారోహణం, పుష్పరథ సేవతోపాటు భద్రకాళి అమ్మవారి జలక్రీడోత్సవ హంస వాహనం తెప్పోత్సవాన్ని రాత్రి నిర్వహించారు. ఈ తెప్పోత్సవంలో భద్రకాళి అమ్మవారిని ఊరేగించారు. నవ రాత్రుల్లో జలవిహార సేవ ఒక కార్యక్రమంగా నిర్వహిస్తారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, నగర మేయర్ గుండు సుధారాణి, రాజ్యసభ సభ్యుడు వొద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ బండా ప్రకాశ్, వరంగల్ కలెక్టర్ సత్య శారద హాజరయ్యారు. అనంతరం భద్రకాళి తటాకంలో జల విహారం తెప్పోత్సవాన్ని ప్రారంభించారు.

పోటెత్తిన భక్తులు

దసరా పర్వదినం సందర్భంగా ఉదయం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు ఆలయానికి భక్తులు పోటెత్తారు. సుమారు లక్ష మంది తరలిరావడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. సర్వదర్శనానికి రెండు, మూడు గంటల సమయం పట్టింది. వీఐపీల రాకతో చాలా ఇబ్బందులు ఎదురయ్యాయి. అమ్మవారిని దర్శించుకోవడంలో కాస్త భక్తులకు కాస్త ఇబ్బందులు ఎదురయ్యాయి. ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురు కాకుండా పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు తరలి వచ్చిన భక్త జనులకు సౌకర్యాలు కల్పించిన వివిధ శాఖల అధికారులు అందించిన సహాయ సహకారాలకు ఆలయ ఈవో శేష భారతి కృతజ్ఞతలు తెలిపారు.



పూజా కార్యక్రమంలో మంత్రి సురేఖ, మేయర్ సుధారాణి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కాటారం, అక్టోబరు 13: ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఐటీ, పరిశ్రమలు వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రైతులు, మహిళలు, దళిత, గిరిజన, బడుగు బలహీనవర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా పథకాలు ప్రవేశపెట్టి సమర్థంగా అమలు చేస్తున్నామని తెలిపారు. దసరా సందర్భంగా శనివారం మండలంలో మంత్రి శ్రీధర్‌బాబు పర్యటించారు. స్వగ్రామమైన ధన్వాడలో దత్తాత్రేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ధన్వాడ నుంచి భూడిదపల్లి వరకు పీఎంజీఎస్‌వై నిధులు రూ.3 కోట్లతో చేపట్టిన రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. గోపాల్‌పూర్, భూడిదపల్లి గ్రామాల్లో పర్యటించి దళిత కుటుంబాలతో మాట్లాడారు. దసరా సందర్భంగా శుభాకాంక్షలు తెలపాలని వచ్చానని వారితో అన్నారు. పలువురు చిన్నారులు, యువతీ యువకులతో ముచ్చటించారు. బాగా చదువుకోవాలని సూచించారు. గోపాల్‌పూర్‌లో పంట పొలాలను పరిశీలించారు. జిల్లాలో 90శాతం సన్న ధాన్యమే పండిస్తున్నారని కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు వంశవర్ధన్‌రావు, పలువురు నాయకులు మంత్రి దృష్టికి తెచ్చారు. కాంగ్రెస్ కార్యకర్త రమేష్ ఇంట్లో మంత్రి జామకాయ తిని చాయ్ తాగారు. ఈ సందర్భంగా కొందరు రైతులు గోపాల్‌పూర్ నుంచి గుమ్మళ్లపల్లి వరకు రైతుల కోసం పంట పొలాల మధ్య నుంచి రోడ్డు నిర్మాణం చేయాలని కోరగా నిధుల మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. మహిళా సాధికారత కోసం పలు కార్యక్రమాలు చేపడుతున్నామని, స్వశక్తిసంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలనుకుంటున్నామని అన్నారు. గ్రామాల్లో 100 శాతం పక్కా రోడ్లను ఏర్పాటు చేస్తామన్నారు. పలువురు తమకు పెన్షన్ ఇప్పించాలని కోరగా ప్రభుత్వం నూతన పెన్షన్లను త్వరలో మంజూరు చేస్తుందని తెలిపారు. త్వరలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చీమల సందీప్, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరి, పీఏసీఎస్ చైర్మన్ తోటపల్లి ప్రశాంత్, మాజీ సర్పంచులు తెప్పల దేవేందర్, అంగజాల అశోక్, జంగిలి నరేష్, నాయకులు రమేష్‌రెడ్డి, ప్రభాకర్, వెంకట్‌రెడ్డి, రఘు, సదాశివ్, సురేందర్, రాజ్‌కుమార్, నారాయణ, రమేష్ ముత్తయ్య, రాజేందర్, నరేష్, శశి, ఉంసింగ్, సడువలి తదితరులు పాల్గొన్నారు.



గోపాల్‌పూర్‌లో సన్నరకం వరి పొలాన్ని పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

సీఎం క్యాంపు ఆఫీసు ఆయుధ పూజలో కాళేశ్వరం అర్చకుడు

మహదేవ్‌పూర్, అక్టోబరు 13: కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ అర్చకుడు శరత్‌చంద్ర శర్మకు అరుదైన అవకాశం దక్కింది. హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగిన ఆయుధ పూజలో ఆయన పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొనగా శరత్‌చంద్ర శర్మ ఆయుధ పూజ చేశారు.



సీఎం రేవంత్‌రెడ్డికి హారతి ఇస్తున్న అర్చకుడు శరత్‌చంద్ర శర్మ

వాగు వద్దకు సరదాగా వెళ్లి..

- గల్లంతై ఇద్దరి మృతి
- భూపాలపల్లి జిల్లాలో ఘటన



రాములు (ఫైల్)



హరీశ్ (ఫైల్)

టేకుమట్ల, అక్టోబరు 13: దసరా సంబరాలు ముగియకముందే ఆ గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. వాగులో నీటమునిగి ఇద్దరు మృతి చెందారు. మండలంలోని వెల్లంపల్లిలో ఆదివారం ఈ దుర్ఘటన జరిగింది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వెల్లంపల్లికి చెందిన సొల్లేటి రాములు (45), గీత హరీశ్ (38), గంపల సుధాకర్, గంపల కార్తీక్, దార శేషు, జాంటు హరీశ్ కుటుంబాలు దసరా పండుగ సందర్భంగా సరదాగా గడిపేందుకు రాఘవరెడ్డిపేట-టేకుమట్ల గ్రామాల మధ్య ఉన్న చలివాగు వద్దకు వెళ్లాయి. వీరిలో గీస హరీశ్, సొల్లేటి రాములు, దార శేషు, జాంటు హరీశ్ గంగల సుధాకర్ వాగులో ఈత కోసం దిగారు. ముందుకు వెళ్తున్న క్రమంలో లోతైన ప్రదేశంలో వీరందరూ నీటమునిగారు. వీరిలో దార శేషు, జాంటు హరీశ్, గంపల సదాకర్ ఎట్టకేలకు బయట పడ్డారు. గీస హరీశ్, సొల్లెటి రాములు బయటకు వచ్చే ప్రయత్నంలో నీటి ప్రవాహానికి ఎదురుగా ఈదుతూ మునిగిపోయారు. వీరి కోసం గాలింపు చర్యలు చేపట్టగా కొద్ది సేపటి తర్వాత ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. రాఘవరెడ్డిపేట గ్రామస్థులు తాళ్లసాయంతో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాలను బయటకు తీశారు. మృతుడు సొల్లేటి రాములు వెల్లంపల్లి గ్రామ పంచాయతీలో కార్మికుడి పని చేస్తున్నాడు. అతడికి భార్య సారక్క, కూతురు మాన, కుమారుడు రాకేష్ ఉన్నారు. మరో మృతుడు గీస హరీశ్ డిగ్రీ పూర్తి చేసి హనుమకొండలోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. అతడి తల్లిదండ్రులు శంకర్, వరలక్ష్మి వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్నారు. దసరా సెలవు ఉండటంతో ఇంటికి వచ్చిన హరీశ్ తిరిగి వెళ్లామనుకున్న క్రమంలోనే వాగులో నీటమునిగి మృతి చెందాడు. పండుగ పూట ఒకే గ్రామంలో ఇద్దరు మృతి చెందడంతో అక్కడ విషాదఛాయలు అలుముకున్నాయి.

యువకుడిపై కత్తితో దాడి

కృష్ణకాలనీ (భూపాలపల్లి), అక్టోబరు 13: పాత కక్షల నేపథ్యంలో ఓ యువకుడిపై మరో యువకుడు కత్తితో దాడి చేసి గాయపరిచిన సంఘటన భూపాలపల్లి మండలం కమలాపూర్ గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. భూపాలపల్లి ఎస్సై2 రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కమలాపూర్ గ్రామానికి చెందిన పెద్దవేని శ్రీవర్ధన్, ఇదే గ్రామానికి చెందిన మూడెత్తుల శ్రీకాంత్ మధ్యగతంలో గొడవలు జరిగాయి. ఈ క్రమంలో శనివారం దసరా పండగ సందర్భంగా జమ్మి కార్యక్రమంలో ఇద్దరు పరస్పరంగా తారసపడ్డారు. గతంలో జరిగిన గొడవల నేపథ్యంలో ఇద్దరు వాగ్వాదం చేసుకున్నారు.

ఈ క్రమంలో కోపోద్రిక్తుడైన శ్రీవర్ధన్ కత్తితో శ్రీకాంత్‌పై దాడి చేయగా కడుపులో గాయలయ్యాయి. దీంతో స్థానికులు 108 సహాయంతో శ్రీకాంత్‌ను తొలుత భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి వైద్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి పంపారు. ఈ మేరకు అందిన ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. గాయపడిన శ్రీకాంత్ పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.

యువతిని వేధించిన వ్యక్తికి దేహశుద్ధి

హనుమకొండ బస్టాండ్‌లో ఘటన

బాలసముద్రం, అక్టోబరు 13: మద్యం మత్తులో యువతిని వేధించిన ఓ వ్యక్తికి దేహశుద్ధి చేసిన ఘటన హనుమకొండ బస్టాండ్‌లో శనివారం రాత్రి జరిగింది. ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లాకు చెందిన ఓ యువతి హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో నర్సుగా పని చేస్తున్నది. దసరా పండుగ కోసం సొంత ఊరు ములుగుకు వెళ్లేందుకు బస్సులో హనుమకొండకు చేరుకుంది.

ములుగుకు వెళ్లే బస్సు కోసం వేచి ఉండగా తనతో రావాలంటూ ఆ వ్యక్తి వేధించాడు. విషయాన్ని అక్కడి సెక్యూరిటీ సిబ్బంది, ప్రయాణికుల వద్ద యువతి గోడు వెల్లబోసుకుంది. దీంతో అక్కడి వారు ఆ వ్యక్తిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఆ వ్యక్తి వివరాలను సెక్యూరిటీ సిబ్బంది ఆరా తీశారు. అతడు హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నట్లు తెలుసుకున్నారు. ఆ వ్యక్తి మద్యం మత్తులో ఉండడంతో పూర్తి వివరాలు సేకరించలేకపోయారు. అతడిపై చర్యలు తీసుకోవాలని యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అంబరాన్నంటిన దసరా వేడుకలు


వరంగల్ ఉర్సు రంగలీలా మైదానంలో రావణ వధ వేడుకలను తిలకిస్తున్న ప్రజలు


వరంగల్ ఉర్సు రంగలీలా మైదానంలో రావణ వధ వేడుకల్లో మాట్లాడుతున్న నగర మేయర్ గుండు సుధారాణి




రంగలీలా మైదానంలో నృత్యం చేస్తున్న దృశ్యం


మహబూబాబాద్ జిల్లా గూడూరులో దసరా ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే మురళీనాయక్, జాటోతు హుస్సేన్‌నాయక్


హనుమకొండ పద్మాక్షి ఆలయం వద్ద నిర్వహించిన దసరా వేడుకల్లో పాల్గొన్న ప్రజలు


హనుమకొండ పద్మాక్షి ఆలయం వద్ద రావణ ప్రతిమకు నిప్పంటిస్తున్న ఎమ్మెల్యే నాయిని


ఉర్సు రంగలీలా మైదానంలో మిరుమిట్లు గొల్పుతున్న తారాజువ్వలు



మెడకు తాడు బిగించి చంపి

- గరిటతో మృతదేహం మర్మాంగాలను కాల్చిన భార్య
- పెనుగొండలో భర్తను హత్య చేసిన భార్య, అత్త, బావమరిది
- పోలీసులకు సమాచారం అందించిన ఆటోడ్రైవర్
- వీడిన కడప జిల్లా వాసి హత్య కేసు మిస్టరీ

కేసముద్రం, అక్టోబరు 13: కేసముద్రం మండలం పెనుగొండలో ఆంధ్రప్రదేశ్‌లోని కడప పట్టణానికి చెందిన లక్కే ప్రశాంత్(30)ను ఆయన భార్య, అత్త, బావమరిది కలిసి తాడుతో ఉరివేసి చంపారు. భర్తను చంపిన అనంతరం ఆతనిపై కసితీరక అట్ల గరిటను వేడిచేసి మర్మాంగాలను భార్య కాల్చింది. ప్రశాంత్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం విదితమే. ఈ కేసులో విచారణ అనంతరం మహబూబాబాద్ రూరల్ సర్కిల్ ఇన్‌చార్జ్ గూడూరు సీఐ బాబురావు తెలిపిన ప్రకారం... ఏపీలోని కడప జిల్లాకు చెందిన లక్కే ప్రశాంత్, అదే జిల్లా సింహాద్రిపురం మండలం చెవ్వారిపల్లి గ్రామానికి చెందిన అమినా ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. ఉపాధి కోసం కడప నుంచి నాలుగు నెలల క్రితం భార్య, పిల్లలతో కలిసి ప్రశాంత్ పెనుగొండలో భవన నిర్మాణ పని చేసేందుకు వచ్చాడు. అమినాకు రెండో పెళ్లి కావడంతో భర్త ప్రశాంత్ అనుమానిస్తూ పిల్లలు నాకు పుట్టలేదు అంటూ నిత్యం మద్యం సేవించి వచ్చి ఆమెను కొడుతుంటాడు. ఈ క్రమంలో తనను నిత్యం శారీరక, మానసిక హింసకు గురిచేస్తున్నాడని, ఇదే గ్రామంలో ఉంటున్న కడప జిల్లా పులివెందుల మండలం ఎర్రగుడిపల్లికి చెందిన అమినా తల్లి కడియాల నూర్జహాన్, సోదరుడు కడియాల అమర్‌భాషాలకు తన గోడు వెల్లబోసుకుంది.


ప్రశాంత్ మృతదేహం

ప్రశాంత్ తనను, పిల్లలను, అవసరమైతే మిమ్మల్ని కూడా చంపుతానని బెదిరిస్తున్నాడని అమినా తల్లి, సోదరునికి తెలిపింది. ఈ క్రమంలో ప్రశాంత్‌ను చంపాలని ముగ్గురు కలిసి నిర్ణయించుకొని ఈనెల 10న అర్ధరాత్రి దాటిన తర్వాత 2.30 గంటల ప్రాంతంలో తాడుతో ప్రశాంత్ మెడకు ఉరిపెట్టి చంపారు. అయినా కసి తీరక అమినా అట్ల గరిట(సరాతం)ను స్టౌపై వేడి చేసి తన భర్త ప్రశాంత్ మర్మాంగంపై కాల్చింది. ఆ తర్వాత గ్రామంలో ఎవరికి అనుమానం రాకుండా మృతదేహాన్ని రైల్వేట్రాక్‌పై పడవేయాలని నిర్ణయించుకొని వారికి తెలిసిన మహబూబాబాద్‌కు చెందిన ఆటో డ్రైవర్ రామును పిలిచారు. ఆటో డ్రైవర్‌ను మభ్యపెట్టి మృతదేహాన్ని ఆటోలో రైల్వేస్టేషన్‌కు తరలిస్తుండగా డ్రైవర్ రాముకు అనుమానం వచ్చి, వారిని నిలదీయగా హత్య విషయం బయటపడింది. దీంతో రాము వెంటనే 100 ద్వారా పోలీసులకు, 108కు సమాచారం అందించాడు. 108 సిబ్బంది ప్రశాంత్ మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

సమాచారం అందుకున్న పోలీసులు నిందితులు అమినా, నూర్జహాన్, అమర్‌భాషాలను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి పోలీసులకు సమాచారం అందించిన ఆటో డ్రైవర్ రామును, కేసు దర్యాప్తును వేగవంతంగా చేసిన ఎస్ఐ మురళీధర్‌రాజ్‌ను జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అభినందించారు.

పద్మశ్రీ సమ్మయ్యకు ఘన సన్మానం

దేవరుప్పుల, అక్టోబరు 13: మండలంలోని అప్పిరెడ్డిపల్లెకు చెందిన చిందు యక్షగాన కళాకారుడు, పద్మశ్రీ గడ్డం సమ్మయ్యను ఆదివారం కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, అలయ్ బలయ్ చైర్మన్ విజయలక్ష్మిలు ఘనంగా సన్మానించి సత్కరించారు. గవర్నర్ దత్తాత్రేయ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరుగనున్న అలాయ్ బలాయ్ కార్యక్రమానికి సమయ్యను ఆహ్వానించగా ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో సమ్మయ్య కుమారుడు హిమగిరి పాల్గొన్నారు.


గడ్డం సమ్మయ్యను సన్మానిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, హరియాణా గవర్నర్ దత్తాత్రేయ

పాత కక్షలతో యువకుడిపై కత్తితో దాడి

జఫర్‌గడ్, అక్టోబరు 13: మండలంలోని కూనూరులో సామల రంజిత్ అనే వ్యక్తిపై ఇదే గ్రామానికి చెందిన ముక్కెర గణేష్ కత్తితో దాడి చేశాడు. ఎస్ఐ బానోత్ రాంచరణ్ నాయక్ తెలిపిన ప్రకారం శనివారం సాయంత్రం గ్రామంలో జరిగిన దసరా ఉత్సవ కార్యక్రమాన్ని గ్రామస్తులతో కలిసి సామల రంజిత్ వీక్షిస్తున్నాడు. ఈ క్రమంలో ఇదే గ్రామానికి చెందిన ముక్కెర గణేష్ పాత గొడవలను మనసులో పెట్టుకుని ఆగ్రహంతో కందుల శివకుమార్, ఇల్లందుల రాజేశ్‌ల సహకారంతో రంజిత్‌పై దాడి చేసి కత్తితో పొడిచి పారిపోయాడు. దీంతో కత్తిపోటుకు గురై కింద పడిపోయిన రంజిత్‌ను చికిత్స నిమిత్తం హుటాహుటిన వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. రంజిత్ తల్లి సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, యువకుడి పరిస్థితి నిలకడగానే ఉందని బంధువులు తెలిపారు.

గార్లలో జాతీయ జెండా ఆవిష్కరణ

గార్ల, అక్టోబరు 13 : మండల కేంద్రంలోని మసీదు సెంటర్లలో ఎంపీడీవో మంగమ్మ శనివారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. తొలుత గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి జెండాను డప్పువాయిద్యాలతో గార్లలోని వీధుల్లో ఊరేగించారు. నైజాం నవాబుల కాలంలో దసరా రోజున నెలవంక ఉన్న నీలిరంగు జెండాను ఎగరవేయడం ఆనవాయితీగా వస్తుంది. నాటి నుంచి ఏటా దసరా పండుగ రోజు గార్ల మసీదు సెంటర్‌లో జాతీయ జెండాను పట్టణ మొదటి పౌరుడు ఎగర వేస్తారు. దేశంలో ఎక్కడాలేని విధంగా విజయ దశమిరోజు జెండాను ఆవిష్కరిస్తారు. 75 ఏళ్లుగా జెండాను ఎగరవేయడం జరుగుతుంది. 1952లో గార్ల టౌన్ మునిసిపాలిటీకి కాంగ్రెస్ పార్టీ చైర్మన్‌గా మాటేటి కిషన్‌రావు ఎన్నికయ్యాడు. నాడు దసరా రోజున మసీదు సెంటర్‌లో కాంగ్రెస్ జెండాను ఎగరవేస్తుండగా కాంగ్రెస్, కమ్యూనిస్టుల మధ్య ఘర్షణలు జరిగాయి. ఈ విషయంపై హైకోర్టుకు వెళ్లారు. దైవభక్తికి చిహ్నం మత సామరస్యానికి ప్రతీకగా జాతీయ జెండాను ఎగరవేయాలని తీర్పు ఇచ్చింది. నాటి నుంచి సర్పంచ్ చేతుల మీదుగా దసరా పండుగ రోజు జాతీయ జెండా ఎగరవేయడం జరుగుతుంది. సర్పంచ్‌ల పదవికాలం ముగియడంతో మండల ప్రత్యేక అధికారి ఎంపీడీవో మంగమ్మ చేతుల మీదుగా జెండా ఎగరవేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిషన్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు అజ్మీరా బన్సీలాల్, గంగావత్ లక్ష్మణ్‌నాయక్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



ఇమ్మడి వారి నాలుగు తరాల
ఉమ్మడి దసరా వేడుకలు


వరంగల్ ఇమ్మడి పుల్లయ్య నివాసంలో దసరా వేడుకల్లో నాలుగు తరాలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 13: ఇమ్మడి నాలుగు తరాల ఉమ్మడి కుటుంబసభ్యులు దసరా పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. వరంగల్‌లోని ఇమ్మడి పుల్లయ్య నివాసంలో దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం వేడుకలు జరుపుకున్నారు. ఈ వేడుకల్లో నాలుగు తరాలకు చెందిన సుమారు 70 మంది నూతన దుస్తులు ధరించి చిన్న..పెద్ద అనే తేడా లేకుండా ఆటా..పాటలతో ఆనందోత్సవాల నడుమ దసరా పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇమ్మడి పుల్లయ్య మాట్లాడుతూ...ఇమ్మడి కుటుంబానికి చెందిన నాలుగు తరాల వారు ఉద్యోగ, ఉపాధిరీత్యా ఇతర ప్రవేశాల్లో నివాసముంటున్నప్పటికీ దసరా పర్వదినాన ఒకే చోట పండుగ జరుపుకొని కష్ట..సుఖాలను పంచుకోవడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే సాంప్రదాయాన్ని కొనసాగించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

బయ్యారంలో విందు భోజనం

- కొత్త అల్లుడికి 66 రకాలతో వంటకాలు
- ఆంధ్ర సంక్రాంతి సంప్రదాయం తెలంగాణలోనూ..
- స్వరాష్ట్రంలో ప్రప్రథమంగా దసరాకు శ్రీకారం



బయ్యారం(మహబూబాబాద్ జిల్లా), అక్టోబరు 13 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా బతుకమ్మ దసరా పండుగను పురస్కరించుకొని బయ్యారంలో ఓ కుటుంబం కొత్త అల్లుడికి రకరకాల వంటకాలతో విందుభోజనం ఏర్పాటు చేశారు. ఆంధ్ర సంక్రాంతి సంప్రదాయాన్ని తెలంగాణలోనూ దసరాకు శ్రీకారం చుట్టిన ఆ కుటుంబం 66 రకాల వంటకాలతో భోజనం ఏర్పాటు చేసి ఔరా.. అనిపించుకున్నారు. వివరాల్లోకి వెళితే..

వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం ధర్మారావుపేట గ్రామానికి చెందిన కల్లూరి రమేష్-కల్పన దంపతుల కూతురు శ్వేతకు ఆగస్టు 28న మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం నాంచారి మడూరు గ్రామానికి చెందిన వంశీతో వివాహమైంది. తెలంగాణ ఆచార సంప్రదాయం ప్రకారం వివాహమైన తరువాత వచ్చే తొలి దసరా, ఉగాది పండుగలను ఛేదు పండుగలుగా భావించి, అత్త ఇంటి వారు కొత్త అల్లుడిని ఇంటికి తీసుకరారు. దీంతో బయ్యారంలో ఉంటున్న శ్వేత పిన్ని బాబాయి గరిపెల్లి లావణ్య-వేణు కుటుంబం నూతన దంపతులైన శ్వేత, వంశీలను దసరా పండుగకు ఆహ్వానించారు. ప్రతీ ఏడాది ఆంధ్ర రాష్ట్రంలో తొలి సంక్రాంతికి వచ్చే కొత్త అల్లుడికి అత్తింటి వారు రకరకాల వంటకాలతో భోజనం ఏర్పాటు చేస్తున్న విషయాన్ని గమనంలో ఉంచుకున్న వేణు-లావణ్య దంపతులు తెలంగాణలోనూ ఆంధ్ర తరహా కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టాలని భావించారు. అందులో భాగంగా శనివారం దసరా పండుగకు వచ్చిన కొత్త అల్లుడికి 66 రకాల వంటకాలతో విందుభోజనం ఏర్పాటు చేశారు. వేణు కుటుంబం స్వరాష్ట్రంలో ఇలా నూతన సంప్రదాయానికి శ్రీకారం చుట్టి కొత్త అల్లుడికి విందుభోజనం ఏర్పాటు చేసిన తీరు సోషల్ మీడియాలో వైరల్‌గా మారి చర్చనీయాంశమైంది.

వైభవంగా విజయదశమి


గోవిందరావుపేటలో దహనమవుతున్న రావణ ప్రతిమ

కాటారం, అక్టోబరు 13 మండలంలో దసరా వేడుకలు శని, ఆదివారాల్లో ఘనంగా జరిగాయి. పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జున రావు, ఎస్సై అభినవ్‌తో వేదపండితుడు లక్ష్మీకాంత్‌శర్మ ఆయుధపూజ చేయించారు. కాటారం తిమ్మన్నకుంట మైదానం, పీహెచ్‌సీ సమీపంలోని బస్టాండ్ స్థలంలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన రావణాసురవధ కార్యక్రమానికి డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మాజీ ఉప సర్పంచ్ నాయిని శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ జాడి మహేశ్వరి, బీఆర్ఎస్ నేత జక్కు రాకేష్, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతలు హాజరై స్థానిక ప్రజలతో కలిసి విగ్రహాలను దహనం చేశారు. శమి(జమ్మి)వృక్షాల వద్దకు పూజల అనంతరం జమ్మి ఆకును తెచ్చి బంధువులు, స్నేహితులకు ఇచ్చి అలాయ్ బలాయ్‌తో శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎస్సై అభినవ్, పీఎస్సైలు త్రిలోక్ నాథ్‌రెడ్డి, రాజన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు, టీజీఎస్పీ బలగాలు ఎలాంటి అవాంఛనీయ సంఘట నలు జరగకుండా బందోబస్తు చేపట్టారు.

• వెంకటాపూర్ (రామప్ప): మండల వ్యాప్తంగా దసరా వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించుకున్నారు. భక్తులు ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నరెడ్ల సనార్ధన్ ఆధ్వర్యంలో తాళ్ల మండువ వద్ద జమ్మిపూజ చేశారు. ల్యాగ వారి కుటుంబం నుంచి బోనం అంగరంగ వైభవంగా తీసుకొచ్చి బొడ్రాయి వద్ద ప్రతిష్ఠించారు. సీఐ శంకర్, వెంకటాపూర్ ఎస్సై జక్కుల సతీష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

• వాజేడు: దసరా సందర్భంగా మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌తో పాటు, పేరూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైలు రుద్రారపు హరీశ్, గుర్రం కృష్ణప్రసాద్ ఆయుధ పూజలు నిర్వహించారు. దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి మండల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

• మల్హర్: మండల వ్యాప్తంగా దసరా వేడుకలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. పండుగతో గ్రామాలు కళకళలాడాయి. కొయ్యూర్ పోలీస్ స్టేషన్ లో ఈ సందర్భంగా ఆయుధ పూజ జరిగింది. అలాగే ఆలయాల్లో పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

• చిట్యాల: మండల కేంద్రంలోని చింతల్లపల్లిలో రావణాసురుడి దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఆయుధ పూజలు నిర్వహించిన ప్రజలు ఊరేగింపుగా జమ్మిపూజ ప్రాంగణా నికి చేరుకున్నారు. చింతల్లపల్లిలో రావణ దహన కార్యక్రమం చిట్యాల సీఐ మల్లేష్ చేతల మీదుగా జరిగింది. అనంతరం జమ్మి పూజా కార్యక్రమంలో అన్ని కుల సంఘాల ప్రముఖులు, ఎస్సై శ్రావణ్‌కుమార్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ పాల్గొన్నారు. శమీ పూజ నిర్వహించి గ్రామస్థులకు పత్రి ప్రసాదం పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆకుల రవీందర్, గుర్రపు రాజేందర్, పిట్టల సమ్మయ్య, సామల ధనంజయ, శృంగారపు రంగాచారి, ముసాపూరి సాయిలు, తూముల సంజీవ్, గౌరిశెట్టి సంతోష్ చేర్ల చందు, ఓర్సు కొంరయ్య, చింతల రమేష్, అల్లం రవీందర్, పిట్టల రమేష్, రాయిని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ మల్లేష్ ఆయధపూజ నిర్వహించారు ఎస్సైలు శ్రావణ్‌కుమార్, షాఖాన్ సిబ్బంది పాల్గొన్నారు.

• కృష్ణకాలనీ (భూపాలపల్లి) : భూపాలపల్లి పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో వాహన, ఆయుధ పూజను నిర్వహించారు. పక్కనే ఉన్న డీఎస్పీ కార్యాలయంలో కూడా ఈ కార్యక్రమం జరిగింది. డీఎస్పీ సంపత్‌రావు, సీఐ నరేష్‌కుమార్, ఎస్సైలు సుధాకర్, రమేష్, సంధ్యారాణి, ట్రైనీ ఎస్సైలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

• మంగపేట: మండలంలో విజయ దశమి వేడుకలు ఘనంగా జరిగాయి. మంగపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై టి.వి.ఆర్.సూరి ఆధ్వర్యంలో ఆయుధ పూజను అర్చకుడు శివరాం నిర్వహించారు. మండల పరిధి 25 గ్రామ పంచాయతీల్లోని దేవాలయాల్లో దసరా సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. మల్లూరు హేమాచలకొండలపై వెలిసియున్న ఆదిలక్ష్మి, చెంచు లక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో అర్చకులు ఉత్సవ విగ్రహాలను కొండపై నుంచి మల్లూరులోని శ్రీస్వామివారి మంటపం వరకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

• గణపురం: మండల వ్యాప్తంగా దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం జమ్మి పూజలు చేశారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తన స్వగ్రామం బుద్దారంతోపాటు చెల్పూరులో నిర్వహించిన దసరా వేడుకలకు హాజరయ్యారు.

• గోవిందరావుపేట: మండలంలో దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. గోవిందరావుపేట, పస్రాలో రావణ వధ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. భారీ రావణ ప్రతిమలను బాణసంచాతో పేల్చివేశారు. అంతకు ముందు గ్రామస్థులంతా డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలను దర్శించుకున్నారు. జమ్మిచెట్టుకు పూజలు చేశారు.

• ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. రామాలయం దేవాలయంలో జమ్మి చెట్టుకు అర్చకులు ఎల్లప్రగడ నాగేశ్వరరావుశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆలువాల శ్రీనివాస్, కమిటీ సభ్యులు జమ్మి చెట్టుకు నూతన వస్త్రాలను అలంకరించి కొబ్బరికాయలను కొట్టారు. ఊరేగింపుగా బొడ్రాయి వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఓడవాడ సమీపలోని జంపన్నవాగు ఒడ్డున ఏర్పాటు చేసిన రావణవధ ప్రాంతానికి చేరుకొని అక్కడ జమ్మి చెట్టుకు అర్చకుడు రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై ఎస్.కె. తాజుద్దీన్, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు, గ్రామ పెద్దలు రావణవధ వద్దకు వచ్చి జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులతో కలిసి రావణ ప్రతిమను సీఐ శ్రీనివాస్ దహనం చేశారు. రెండోఎ ఎస్సై రమేష్, సిబ్బంది పాల్గొన్నారు. ఏటూరునాగారం పోలీస్ స్టేషన్‌లో సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్ ఆయుధ పూజ నిర్వహించారు.

• మహదేవపూర్ రూరల్: పలిమెల, మహదేవపూర్ మండలాల వ్యాప్తంగా విజయదశమి వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం పలువురు ఆయుధ, వాహన పూజలు నిర్వహించారు. శనివారం రావణవధ, శమీ పూజల అనంతరం ఒకరికొరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

• రేగొండ: రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లోని గ్రామాల్లో దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయుధ పూజ నిర్వహించడంతో పాటు జమ్మీ పూజలో ప్రజలు పాల్గొన్నారు. రేగొండ మండల కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశీధర్‌రెడ్డి స్వగృహంలో ఆయుధ పూజ జరిగింది. పద్మశాలి సంఘం అధక్షుడు నామాన రమేష్ బొడ్రాయి విగ్రహాలకు పూజలు చేశారు. కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో స్నేహ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల రాజు ఆధ్వర్యంలో రావణవధ కార్యక్రమం జరిగింది. ఎస్సై సందీప్ కుమార్ బందోబస్తును ఏర్పాటు చేశారు.


చెల్పూరు దసరా ఉత్సవాల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


ప్రత్యేక పూజలో భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, సీఐ, ఎస్సైలు, సిబ్బంది


కాటారం పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ


వాజేడు పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ చేస్తున్న పోలీసులు


వెంకటాపూర్‌లో దసరా వేడుకల్లో బోనాలతో గ్రామస్థుల ఊరేగింపు

• ములుగులో ఘనంగా రావణవధ


మంటల్లో కాలుతున్న రావణాసుర ప్రతిమ


ప్రదర్శన ఇస్తున్న కళాకారుడు


రావణ దహన కార్యక్రమంలో పాల్గొన్న జనం

ఘనంగా దుర్గాదేవి శోభాయాత్ర



కాళేశ్వరం, భూపాలపల్లిలో దుర్గాదేవి శోభాయాత్రలు

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 13: భూపాలపల్లి పట్టణంలోని రెడ్డికాలనీ, సుభాష్‌కాలనీ, టీ-2 క్వార్టర్స్, కృష్ణకాలనీ, కారల్‌మార్క్స్‌కాలనీల్లో దుర్గాదేవిని ప్రతిష్ఠించిన భక్తులు శరన్నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వ హించారు. తొమ్మిదరోజుల అనంతరం ఆదివారం శోభాయాత్ర నిర్వహించారు. మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం గోదావరి వద్ద నిమజ్జనం చేశారు.

• మహదేవపూర్: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తేశ్వరస్వామి ఆలయ ఉత్సవ విగ్రహాల ఊరేగింపును ఘనంగా నిర్వ హించారు. స్వామి వారి సన్నిధానం నుంచి మంగళవాయిద్యాలు, భక్తిపాట లతో జమ్మిచెట్టు వద్దకు ఊరేగింపుగా తరలించారు. ప్రత్యేక పూజలు నిర్వ హించి భక్తులకు జమ్మి ఆకులను అందజేశారు.

• ఏటూరునాగారం: మండల కేంద్రంలోని రామాలయంలో, కన్యకాపరమేశ్వరి ఆలయ నిర్మాణ స్థలం, సాయిబాబా ఆలయం, ఐటీడీఏ క్రాస్‌రోడ్డు తదితర ప్రాంతాల్లోని దుర్గాదేవి నవరాత్రులను ఘనంగా నిర్వహించారు. అమ్మవారు శ్రీకనకదుర్గమ్మ దేవిగా ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక రథాలు ఏర్పాటు చేసి ఊరేగించారు. అమ్మవారిని మండలంలోని ముల్లకట్ట వంతెన వద్ద నిమజ్జనం చేశారు.

• మల్హర్: మండల కేంద్రమైన తాడిచర్లతో పాటు పలు గ్రామాల్లో దుర్గామాత నిమజ్జన కార్యక్రమం ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. తొలుత అమ్మవారిని గ్రామపుర వీధుల మీదుగా ఊరేగించగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

• కాటారం: మండలకేంద్రంతోపాటు ధన్వాడ, గూడూరు గ్రామాల్లో దుర్గామాత శోభయాత్రలు ఆదివారం సాయంత్రం వైభవంగా జరిగాయి. దేవీ శరన్నవ రాత్రోత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని రెడ్డి కాలనీలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, లక్ష్మీదేవర ఆలయంలో, ఎర్రగుంటపల్లిలో, ధన్వాడలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో, గూడూరులో స్థానిక యువత ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గామాతను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో పురవీధుల మీదుగా ఊరేగించారు. తొమ్మిది రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవారిని వివిధ రూపాలు, అలంకారాల్లో పూజలు నిర్వహించిన భక్తులు కాళేశ్వర త్రివేణి సంగమంలో నిమజ్జనం చేయడానికి తరలించారు. అమ్మవారికి భక్తులు మంగళహారతులతో ఎదురేగి మొక్కులు తీర్చుకున్నారు. వేదపండితులు కృష్ణమోహన్, నాగరాజు, ప్రవీణ్, సుమిత్, లక్ష్మీకాంత్, గణేష్‌శర్మ అమ్మవారికి నిత్యపూజతో పాటు నిమజ్జన పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

• చిట్యాల: శరన్నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న దుర్గాదేవి నిమజ్జనం ఆదివారం జరిగింది. మండల కేంద్రలంలోని చిట్యాల, చింతల్లపల్లి, వెంకట్రావుపల్లి, తిర్మలపురం, చల్లగరిగ, గోపాలపురం, నైన్‌పాక, గిద్దెముత్తారం గ్రామాల్లో ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల చెరువులు, కుంటల్లో దుర్గామాత విగ్రహాలను నిమజ్జనం చేశారు.

రామప్పలో భక్తుల సందడి

వెంకటాపూర్ (రామప్ప), అక్టోబరు 13: మండలంలోని ప్రఖ్యాత రామప్ప దేవాలయంలో ఆదివారం సందడి నెలకొంది. వారాంత, దసరా సెలవులు కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. రామలింగేశ్వరుడిని దర్శించుకొని పూజలు చేశారు. పూజారుల నుంచి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే రామప్ప దేవాలయాన్ని స్విజ్జర్లాండ్ దేశానికి చెందిన సంద్ర సందర్శించారు.


రామప్ప ఆలయంలో స్విజ్జర్లాండ్ దేశస్థురాలు

ద్విచక్రవాహనాల ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు


సంఘటన స్థలంలో క్షతగాత్రులు

మంగపేట, అక్టోబరు 13: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని పాలాయిగూడెం వద్ద బూర్గంపహాడ్- ఏటూరునాగారం ప్రధాన రహదారిపై శనివారం చోటుచేసుఉంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బుచ్చంపేటకు చెందిన చీమల రవి, చీమల సమ్మయ్య దసరా పండుగ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలోని కొత్తూరులో ఉన్న బంధువులు మద్దెల సుమ, రాజు ఇంటికి ద్విచక్రవాహనంపై బయల్దేరారు. ఈ క్రమంలో రాజుపేట వైపు నుంచి మంగపేటకు వస్తున్న కారును ఓవర్‌టెక్ చేసేక్రమంలో రోడ్డు పక్కనే ద్విచక్ర వాహనంపై ఉన్న మండలంలోని రమణక్కపేటకు చెందిన బట్ట సతీష్‌ను ఢీకొన్నారు. దీంతో రవి, సమ్మయ్య తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి వైద్యులు ములుగు ఏరియా ఆస్పత్రికి పంపారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదం.. తప్పిన ప్రాణాపాయం

వాజేడు, అక్టోబరు 13: మండలంలో శనివారం మధ్యహ్నాం రోడ్డు ప్రమాదం చోటు చేసుకొని ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలానికి చెందిన నలుగురు వాజేడు మండలంలోని బొగత జలపాతం సందర్శనకు బయల్దేరారు. జగన్నాథపురం వద్ద ట్రాక్టరు వాజేడుకు వెళ్లేందుకు మలుపు తిప్పుతుండగా వేగంగా వస్తుండగా వీరి కారు దానిని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురులో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. ట్రాక్టరు డ్రైవరు సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదంలో ట్రాక్టరు రెండు భాగాలుగా విడిపోయింది. కారు నుజ్జు నుజ్జు అయింది. కారు ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో అందులో ఉన్న వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు.


రెండు ముక్కలైన ట్రాక్టర్


నుజ్జునుజ్జు అయిన కారు

ఏఎంసీ డైరెక్టర్‌కు ఎమ్మెల్యే పరామర్శ

చిట్యాల, అక్టోబరు 13: చిట్యాల ఏఎంసీ డైరెక్టర్ చెన్న చందర్ అనారోగ్యం బారినపడి ఆస్పత్రిలో చికిత్సపొంది ఇంటికి చేరుకున్నారు. మండలంలోని తిర్మలపురం గ్రామంలో చందర్‌ను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారా యణరావు శనివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలు సుకున్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా చికిత్సకు అవసరమైన డబ్బులను అంది స్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ, చిలుకల రాయకొంరు, బొజ్జం వేణు తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాల ప్రారంభం

కాటారం, అక్టోబరు 13 :మండలంలోని విలాసాగర్ గ్రామపంచాయతీ పరిధిలో సీసీ కెమె రాలను సీఐ నాగార్జునరావు ఎస్సై మ్యాక అభినవ్‌తో కలిసి ఆదివారం రాత్రి ప్రారంభించారు. గ్రామప్రజలు, నాయకులు, వ్యాపారుల సహకారంతో పోలీస్ అధికారులు 10 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి గ్రామపంచాయతీ కార్యాలయంలో డిస్‌ప్లే స్క్రీన్ బిగించారు. ప్రజల సమక్షంలో సీసీ కెమెరాలను ప్రారంభించిన అనంతరం సీఐ మాట్లాడారు. సీసీ కెమెరాల ద్వారా బహుళ ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. మాజీ సర్పంచ్ సత్యనారాయణ, నాయకులు రాజు, శశికుమార్, మల్లయ్య, రాజయ్య, రవీందర్, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ విద్యార్థులను సన్మానించిన మంత్రి సీతక్క


విద్యార్థులను సన్మానిస్తున్న మంత్రి సీతక్క

ములుగు, అక్టోబరు 13: ములుగు మండలం అన్నంపల్లి గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మెడికల్ సీట్లు సాధించడం పట్ల రాష్ట్ర మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. పోరిక సూరజ్, పోరిక సభాపతి సౌరభ్ అభయానంద్, పోరిక సాయిరాం, పోరిక కల్యాణి నీట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రంలోని ఆయా వైద్య కళాశాలల్లో సీట్లు పొందారు. విజయదశమి రోజు ఈ నలుగురిని మంత్రి సీతక్క ములుగులో శాలువాలతో సన్మానించారు. గిరిజన యువత ఉన్నత విద్యలో రాణించడం అభినందనీయమన్నారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడికి నివాళి

ఏటూరునాగారం: మండలంలోని షాపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ముద్రబోయిన రఘు అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని మంత్రి ధనసరి సీతక్క సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. మంత్రి వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు, పీఎసీఎస్ డైరెక్టర్ వంగపండ్ల రవి యాదవ్, కన్నాయిగూడెం మాజీ జడ్పీటీసీ చందు, పార్టీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు అయ్యూబ్, యూత్ మండల అధ్యక్షుడు నవీన్, పార్టీ నాయకులు ఎమ్డీ. గౌస్, ఈసం నరసయ్య, కె. రంజిత్, సరికొప్పుల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ మధుసూదనాచారి జన్మదిన వేడుకలు


చెల్పూరులో సిరికొండ జన్మదిన వేడుకలు

గణపురం, అక్టోబరు 13: ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి జన్మదిన వేడుకలను గణపురం మండల కేంద్రంతోపాటు చెల్పూరులో అభిమానులు, బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమారస్వామి, కోల రవీందర్, రజియా, రాజేందర్, జన్నయ్య, వెంకన్న, రవి, వెంకట్, కార్తిక్, రామకృష్ణ, దొంగల సుధాకర్, శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు.

• చిట్యాల: ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. సీనియర్ నాయకులు చింతల రమేష్, జన్నె యుగందర్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు పిట్టల రాజమౌళి, పువ్వాటి హరికృష్ణ, కోడెల రాయమల్లు, తాటిపెల్లి శ్రీనివాస్, ముసాపూరి రవీందర్, కోడెల నందకుమార్, వీణవంక శ్రీదేవి, చిదిరాల సరోజన, మైదం కరుణ, చేర్ల చందు, సిరికొండ అభిమానులు గురుకుంట్ల కిరణ్, రాయిని శ్రీకాంత్, ఉప్పుల కిరణ్ పాల్గొన్నారు.